బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం: ముద్దగౌని



రాంమోహన్‌గౌడ్

ఎల్‌బీనగర్: ఎల్‌బీ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, పార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జ్ ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం బీఎన్‌రెడ్డి నగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుధీర్‌రెడ్డికి తనకు ఎలాంటి విభేదాలు లేవని, ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ పార్టీకి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. రాబోయే కాలంలో ప్రతీ కార్యకర్తకు, నాయకుడికి న్యాయం జరిగే విధంగా సుధీర్‌రెడ్డితో పాటు తాను చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌బీనగర్ టికెట్‌ను ముద్దగౌని లక్ష్మీప్రసన్నకు కేటాయిస్తామని చెప్తే కాంగ్రెస్‌లో చేరామని, తర్వాత ఆ పార్టీ నాయకులు టికెట్ కేటాయించకుండా మోసం చేశారన్నారు. అందుకే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సూచనలతో తిరిగి బీఆర్ఎస్‌లో చేరానన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు.. అక్రమ నిర్మాణాల్లో కబ్జాదారులు ..

బిజీ బిజీ

ఫతుల్లాగూడలో రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

- రాత్రికి రాత్రే అక్కడ నిర్మాణాలు
- అధికారులకు స్థానికుల ఫిర్యాదు



బండ్లగూడ సర్వే నం. 58లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు



నాగోలు: రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో బిజీ బిజీగా ఉండగా, దీన్ని ఆసరా చేసుకొని కొందరు ప్రభుత్వ స్థలాల కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధిలోని ఫతుల్లాగూడ సర్వే నెంబర్ 58లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గతంలో కొంత భాగాన్ని ఉప్పల్ రెవెన్యూ అధికారులు ఆట స్థలానికి, మరికొంత స్థలాన్ని బస్తీ దవాఖానాకు కేటాయించారు. స్థలాల కేటాయింపు పత్రాలను ఉప్పల్ రెవెన్యూ అధికారులు జీహెచ్ఎంసీ, దవాఖానాకు సంబంధించిన అధికారులకు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎలెక్షన్ విధుల్లో నిమగ్నమై ఉన్నారు. దీనిని అవకాశంగా చేసుకొని కొందరు కబ్జాదారులు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. సర్వే నెంబర్ 58లో రాత్రికి రాత్రే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఖాళీ స్థలంలో మట్టిని నింపుతూ అక్కడ నిర్మాణాలు చేస్తున్నారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. మంగళవారం ఈ విషయంపై స్థానికులు ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన నాగోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 58 కు వచ్చి అక్రమ నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిసింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

జంగ్ తెలంగాణ 2023

ప్రజలను రెండుసార్లు మోసం చేసిన కేసీఆర్

- మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్



ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పర్యాయాలు మోసం చేశాడని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ప్రజలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ లోనీ ఎన్టీఆర్ నగర్‌లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ సీఎం అయిన తర్వాత దళితులకు మూడు ఎకరాల భూమి, నిరు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని, యువతకు ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ రేషన్ షాపులో తొమ్మిది రకాల వస్తువులు ఇస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పిట్ట హరినాథ్ రెడ్డి, పున్న గణేష్ నేత, చిక్కుళ్ల శివ ప్రసాద్, సామిడి గోపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవ చేస్తున్నా.. ఎమ్మెల్యేగా గెలిపించండి



వనస్థలిపురంలో ప్రచారం చేస్తున్న సామ రంగారెడ్డి

ఎల్బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: గత కొన్నేళ్లుగా పదవి లేకున్నా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్ కాలనీ ఫేజ్–1లోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ఆయన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, హరీష్‌రెడ్డి, పోరెడ్డి కవిత, మాధవి, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో...

వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బీజేపీ సామ రంగారెడ్డి మంగళవారం వనస్థలిపురంలో ప్రచారం చేశారు. నాయకులు నూతి శ్రీనివాస్, విజయ్‌కుమార్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల మద్దతు...

ఎల్‌బీనగర్‌కు చెందిన న్యాయవాదులు మంగళవారం సామ రంగారెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. న్యాయవాదులు పీతం ప్రదీప్ కుమార్, స్వర్ణలత, విష్ణువర్ధన్, చంద్రశేఖర్, విజయ్‌మోహన్, పెరిక విష్ణు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం మలక్‌పేట ప్రజలతోనే ఉంటా..

మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్

మలక్‌పేట: రాజకీయాల్లోకి మలక్‌పేట నుంచి తొలి అడుగు వేశానని, జీవితాంతం ఇక్కడే ఉండి ప్రజలకు సేవలందిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ అలీ మెహదీ, సీనియర్ నేతలు మందడి విజయసింహారెడ్డి, ముజఫర్ అలీఖాన్, బొల్లు కిషన్‌లతో కలిసి అక్బర్‌బాగ్‌లోని ఎన్నికల కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల మ్యానిఫెస్టో పత్రాలను విడుదల చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణ యాదవ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, బద్దం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు అక్కినేని స్మారక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ట్రాన్స్‌జెండర్ వాసవి

హస్తినాపురం: సమాజంలో మహిళలు, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్లను సైతం గౌరవించాల్సిన అవసరం ఉందని, వారు సైతం సేవా భావంతో సమాజ సేవ చేస్తున్నారని వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు అన్నారు. ట్రాన్స్‌జెండర్ సేవలను గుర్తించి హస్తినాపురానికి చెందిన వాసవికి అక్కినేని నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ, ప్రముఖ రచయిత్రి రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా



ఈదులకంటి గార్డెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చానని, ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పరిష్కరించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఈదులకంటి గార్డెన్స్‌లో నిర్వహించిన అన్ని కాలనీల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా చూడాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మన్సురాబాద్‌లో..

చింతకుంటలో నాయకుడు ఖైసర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం మసీదు కమిటీ ఇమామ్, మోజన్ల సమావేశంలో సుధీర్‌రెడ్డి పాల్గొని ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ నాయకుడు రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

మహేశ్వరం: బీఆర్ఎస్‌తోనే మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామజాన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. మండలంలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీ(ఈ–సిటీ), మహేశ్వరం ఎలక్ట్రానిక్ పార్కు, తుమ్మలూరు ప్లాస్టిక్‌పార్కులో మరిన్ని కంపెనీలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ అంజనేయులు గౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌చారి, వెంకటేశ్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పరమేష్ గౌడ్, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజల బ్రహ్మరథం

అభ్యర్థి మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ఏ కాలనీకి వెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘన విజయమని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మన్సూరాబాద్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తూ ప్రచారం చేశారు. పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బుడ్డ సత్యనారాయ, జితేందర్ పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

మలక్‌పేట: మూసారంబాగ్ గడ్డిఅన్నారంలో ఏర్పాటు చేసిన బీజేపీ మలక్‌పేట నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని సోమవారం రాత్రి ఆ పార్టీ గోవా అధ్యక్షుడు, ఎంపీ సదానంద్ సేఠె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేటలో బీజేపీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అందరూ కలిసి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, అభ్యర్థి సురేందర్‌రెడ్డి మంగళవారం మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఫాం అందుకున్న సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి పార్టీ నుంచి బీఫాం అందుకున్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామ సుందర్‌రెడ్డికి పార్టీ బీఫాంను అందజేశారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

గులాబీ జెండా.. ప్రజలకు అండ

మలక్‌పేట: గులాబీ జెండా ప్రజలకు అండగా ఉంటుందని మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ ఇందిరానగర్, లక్ష్మీనగర్ కాలనీలో మంగళవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇలా ఉండగా, ప్రగతి భవన్‌లో మంగళవారం మంత్రి కేటీఆర్ మలక్‌పేట నియోజక వర్గ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డికి బీఫాం అందజేశారు.

ప్రభుత్వ పథకాలను వివరించాలి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కేపురంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో డివిజన్ బూత్ ఇన్‌చార్జితో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో 4 నామినేషన్లు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి తరపున గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకి అందజేశారు. తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా చెన్నోజు శ్రీనివాసులు, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి ఎర్గి హనుమంతు, స్వతంత్ర అభ్యర్థిగా కె.నాగదేవ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 13 నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి పంకజ తెలియజేశారు.

మలక్‌పేటలో రెండు...

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో పోటీ చేసేందుకు మంగళవారం రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఆలిండియా మజ్లిస్ ఏ ఇంక్విలాబ్ ఏ మిల్లత్ పార్టీ నుంచి ఖాజా మొయినుద్దీన్, సోషలిస్టు పార్టీ నుంచి అంబి హనుమంతరావు నామినేషన్ వేశారు.

యాకుత్‌పురాలో రెండు...

సైదాబాద్: యాకుత్‌పురా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆర్‌ఓ కార్యాలయంలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం చంపాపేటలోని సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో ఇప్పటికే నామినేషన్ వేసిన నియోజకవర్గ ఎంఐఎం అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఇండిపెండెంట్ అభ్యర్థి అక్రమ్ అలీ ఖాన్‌లు తమ రెండో సెట్ నామినేషన్లు అందజేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు



ఏసీపీ భీంరెడ్డి, సీఐ జలేంధర్‌రెడ్డిలకు సూచనలు చేస్తున్న సీపీ చౌహాన్

హస్తినాపురం: శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని, ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ వనస్థలిపురం పోలీసులను ఆదేశించారు. మంగళవారం రాత్రి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ ను ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీతో కలిసి కమిషర్ చౌహాన్ తనిఖీ చేశారు. అనంతరం వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐ జలేంధర్‌రెడ్డి , డీఐ వెంకట్‌తో పాటు ఎస్ఐలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చౌహాన్ మాట్లాడుతూ, సున్నితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. ప్రధానంగా వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, ఇతర కీలకపాయింట్ల వద్ద, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు సక్రమంగా కొనసాగేలా పర్యవేక్షించాలని డీసీపీ, ఏసీపీలను ఆయన ఆదేశించారు.

ఉద్యమకారుల సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడిగా సైదులు

నాగోలు: తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన కంతం సైదులు నియమితులయ్యారు. మంగళవారం తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమిత రాష్ట్ర అధ్యక్షులు రూబీ స్టీవెన్, ప్రధాన కార్యదర్శి పి.వెంకన్న, బీరెల్లి వెంకట్‌రెడ్డి, యుగంధర్ శర్మ ఆధ్వర్యంలో సైదులుకు నియామక పత్రం అందజేశారు.

బాణసంచా షాపుల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

మలక్‌పేట: దీపావళి పండుగ సందర్భంగా క్రాకర్స్ షాపులు ఏర్పాటు కోసం తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పానుగంటి శ్రీధర్ అన్నారు. అక్బర్‌బాగ్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాత్కాలికంగా బాణసంచా దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షీట్స్(రేకులు)తో మాత్రమే షెడ్లు ఏర్పాటు చేయాలని, తడకలు, బట్టలు వాడరాదన్నారు. కరెంట్ తీగలు పైపులతో బిగించాలని, ఎక్కువగా కరెంట్ తీగలు వాడొద్దన్నారు. ప్రతీ దుకాణం వద్ద 2 టెంకలు ఇసుక, రెండు డ్రమ్ముల నీళ్లు, 2 అగ్ని మాపక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు.

కారు వెనుక ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి.. గంజాయి అక్రమ రవాణా

- రూ. 25 లక్షల విలువైన గంజాయిని పట్టుకున్న హయత్‌నగర్ పోలీసులు



గంజాయి తరలిస్తున్న కారును పరిశీలిస్తున్న డీసీపీ సాయిశ్రీ

నాగోలు: కారు వెనుక భాగంలో ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి..అందులో గంజాయిని నింపి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ. 25 లక్షల విలువైన 87.6 కేజీల గంజాయి, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సాయిశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. పూణె నగరానికి చెందిన రాజు గంజాయికి బానిస. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇతను ఏపీలోని ఏజెన్సీ ప్రాంతంలో సన్యాసిరావు అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి అధిక మొత్తానికి పూణెలో విక్రయిస్తున్నాడు. పూణెలోని కడక వాస్లా గ్రామానికి చెందిన కారు డ్రైవర్ అతుల్ సావతా గైక్వాడ్(34)ఇతనికి స్నేహితుడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గైక్వాడ్‌కు కారులో గంజాయిని సరఫరా చేస్తే ట్రిప్పుకు రూ. 40 వేలు ఇస్తానని రాజు చెప్పాడు. అంగీకరించిన అతను తన స్విఫ్ట్ కారు వెనుక భాగంలో ప్రత్యేక క్యాబిన్ తయారు చేయించి అందులో గంజాయిని నింపి అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఇప్పటికే ఇలా మూడు సార్లు గంజాయిని తరలించాడు. ఈ నెల 4న మరోసారి ఏజెన్సీ ప్రాంతంలో 87,6 కేజీల 52 గంజాయి పాకెట్లను కారులో నింపుకుని పూణె బయలుదేరాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్‌పై ఈనెల 6న మధ్యాహ్నం తనిఖీలు చేపట్టి కారును పట్టుకున్నారు. పోలీసులు గైక్వాడ్‌ను అరెస్టు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మిగతా నిందితులు రాజు, సన్యాసిరావు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, డీఐ నిరంజన్ పాల్గొన్నారు.

ఎస్టీయూటీఎస్ వార్షిక కౌన్సిల్ సమావేశం

వనస్థలిపురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) ఎల్లవేళలా ముందు ఉంటుందని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తు పాండురంగారెడ్డి, పుట్టపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల వార్షిక కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హయత్‌నగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భాస్కర్, గోపాల్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, పాండులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజమణి, జిల్లా నాయకులు రవికుమార్, రామేశ్వరి, సునీత, బాలకృష్ణ పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: కట్నం కోసం వేధించి భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జయప్రసాద్ మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ పొద్యారపు రవి కథనం ప్రకారం... రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో నివాసం ఉండే మాల దాసరి తిరుపతి(32), భవాని భార్యాభర్తలు. పెళ్లైన ఏడాది వరకు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత భర్త అదనపు కట్నం కోసం భవానీని శారీరక, మానసిక వేధింపులకు గురి చేయడం మొదలుపెట్టాడు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టి భార్యను హింసించొద్దని తిరుపతిని మందలించారు. ఆ తర్వాత అతను మరింత హింసించ సాగాడు. 2015, ఫిబ్రవరి 2న భవానీని విపరీతంగా కొట్టడంతో అర్ధరాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించి కోర్టు నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది.

చిన్నారులకు ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు



శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారులను చూపిస్తున్న వైద్యులు

చైతన్యపురి: పుట్టుకతో చెవిటి, మూగ పిల్లకు చైతన్యపురిలోని మాగ్నస్ ఈఎన్‌టీ ఆసుపత్రిలో ప్రభుత్వ ఏడీఐపీ స్కీమ్ ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ఖర్చు అయ్యే ఈ సర్జరీలను ఉచితంగా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కె.ఘన (4), సూర్యాపేట జిల్లాకు చెందిన కె.ఉదయంశ్రీ, (2), ఆదిలాబాద్‌కు చెందిన డి.అఖిల (2)కు మంగళవారం ఆపరేషన్ చేశారు. ఈఎన్‌టీ సర్జన్‌లు డాక్టర్ ఎస్ రవికుమార్, ఎ.సత్యకిరణ్, అనస్థీషియా వైద్యుడు జె,రవికుమార్, ఆడియాలజిస్ట్ టి.నాగకిరణ్‌లు విజయవంతంగా ఈ ఆపరేషన్‌లు పూర్తి చేశారని ఆసుపత్రి బృందం తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, ఈ కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా బధిర చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ఎంత చిన్న వయసులో శస్త్ర చికిత్స చేస్తే అంత మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏడీఐపీ స్కీమ్ ద్వారా ఉచితంగా ఈ సర్జరీలు చేయించుకోవచ్చన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లల కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 27, వంకాయ 13, బెండ 28, పచ్చిమిర్చి35, కాకర 23, బీర 23, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 11, క్యారెట్ 31. దొండ 13, ఆలు 21, ఉల్లి 35, గోకర 28, దోస 13, సొర 09, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 65, అర్వి 35, మునగ 85, చిలగడదుంప 35, బీట్‌రూట్ 25, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 35. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

12న మన్సూరాబాద్‌లో సదర్ సమ్మేళనం

మన్సూరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 12న మన్సూరాబాద్‌లో సదర్ సమ్మేళనం నిర్వహిస్తామని యాదవ మహాసభ నాయకులు పోచబోయిన గణేష్‌యాదవ్, ఈశ్వరమ్మయాదవ్ తెలిపారు. చింతలకుంటలో మంగళవారం వారు మాట్లాడుతూ, ఈ నెల 12న సాయంత్రం 9 గంటలకు సదర్ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కొత్తపేట, నాగోలు, చింతలకుంట, హయత్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి దున్నలను తీసుకొచ్చి ఇక్కడ ప్రదర్శిస్తారని వారు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు యాదయ్యయాదవ్, సత్యనారాయణయాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.